

జిల్లా పోలీస్ యంత్రాంగంలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. కొంతకాలంగా నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో దొంగతనాలు, గంజాయి విక్రయాలు, అరాచక కార్యకలాపాలు అధికమవుతున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికలకోడ్ ముగిసి 45 రోజులు కావస్తున్నా జిల్లాలో పోలీస్ మార్క్ పాలన లేదు. పైఅధికారులంతా నిద్రావస్థలోనే ఉన్నారని దిగువస్థాయి పోలీసులే చెప్పుకుంటున్నారు. నూతన ఎస్పీ రావడంతో తనదైన మార్కు పాలనను అమల్లోకి తెచ్చి నేరాల అదుపునకు కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉందని దిగువ సిబ్బంది చెబుతున్నారు.

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరాచకాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. పోలవరం మట్టి, బ్రహ్మయ్య లింగం చెరువు మట్టిని తవ్వి కోట్లాది రూపాయలు ఆర్జించిన వంశీ, ఆయన అనుచరులు చివరికి పట్టా భూములనూ వదలని విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తమ ఆవేదన చెబుతున్నారు.



వంశీ, ఆయన అనుచరులు కబ్జా చేసి తవ్వకాలు సాగించిన మల్లవల్లిలోని భూమి

పట్టా భూములనూ చెరపట్టారు

మల్లవల్లిలో మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుల నిర్వాకం

5.30 ఎకరాల పట్టా భూమిలో 40 అడుగుల తవ్వకాలు

- రూ.7 కోట్ల విలువైన మట్టి తరలింపు
- భూ యజమానులు టీడీపీ మద్దతుదారులు కావడం వల్లే..
- వైసీపీలోకి రావాలని హుకుం.. రాకపోవడంతో భూమి కబ్జా

పొలంలో పాగా.. అడ్డగోలు తవ్వకాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడకు చెందిన మెస్సర్స్ శివ క్రెడిట్స్ అనే సంస్థ బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలోని సర్వే నెంబరు 12-2ఏ1లో సుమారు 5.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మెట్ట పొలాన్ని 2015లో కొనింది. ఈ సంస్థకు చెందినవారు 2019 ఎన్నికల సమయంలో గన్నవరం ఎమ్మెల్యేగా పోటీ చేసిన వంశీకి మద్దతుగా నిలిచారు. ఆర్థికసాయం కూడా చేశారు. ఆ తర్వాత సీన్ మారింది. వంశీ టీడీపీ నుంచి వైసీపీలో చేరడం, టీడీపీలో బలంగా ఉన్న వారిపై కక్షసాధింపు చర్యలకు దిగడం మొదలుపెట్టారు. అందులో భాగంగా మల్లవల్లిలో సర్వే నెంబరు 12-2ఏ1లోని భూమిపై వంశీ, ఆయన అనుచరుల కన్ను పడింది. ఇక వారి అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది. ఆ భూమిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న వంశీ అనుచరులు సుమారు 40 అడుగుల లోతున మట్టిని తవ్వేసి, తరలించారు. దీనిపై స్థల యజమానులు మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. పైగా అసలు ఆ స్థలమే వారిది కాదంటూ వంశీ అనుచరులు అడ్డగోలు వాదనకు దిగారు. దీంతో ఏ అధికారీ అటువైపు చూడలేదు.

రూ.7 కోట్ల మట్టి దోపిడీ

ఎకరా విస్తీర్ణంలో 10 అడుగుల లోతున మట్టి తవ్వితే వెయ్యి లారీల మట్టిని తరలించవచ్చు. ఈ లెక్కన 40 అడుగుల లోతున తవ్వకాలకు ఎకరాకు 4 వేల లారీల మట్టిని తరలించవచ్చు. ఈ లెక్కన వంశీ అనుచరులు మల్లవల్లిలోని సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో 24 వేల లారీల మట్టిని తవ్వి తరలించారు. లారీ మట్టి తక్కువలో తక్కువ రూ.3 వేల చొప్పున విక్రయించినా మొత్తంమీద రూ.7.20 కోట్లు అక్రమంగా ఆర్జించారు. ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా ఈ తవ్వకాలు జరిగిపోయాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు లక్షలాది రూపాయలు గండిపడింది. స్థల యజమానికి చెందిన పొలం ఎందుకూ పనికిరాకుండా పోయింది.

తీరు మారని రెవెన్యూ

రాష్ట్రంలో వైసీపీ పాలన ముగిసి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినా గన్నవరం నియోజకవర్గంలో రెవెన్యూ అధికారుల తీరు మాత్రం మారలేదు. గతంలో ఇక్కడ ఏళ్ల తరబడి తహసీల్దార్‌గా ఉంటూ వంశీకి నమ్మినబంటుగా పేరున్న నరసింహారావు ఇలాంటి అక్రమాలకు పెట్టింది పేరుగా మారారు. ఎన్నికల సమయంలో ఆయన్ను బదిలీ చేసినా ఆయన అనుచరగణం ఇంకా వైసీపీ నాయకులకు అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు. మల్లవల్లిలోని పొలానికి సంబంధించి ఎలాంటి వివాదం లేకపోయినా వంశీ అనుచరుల మాట మేరకు.. వివాదాస్పదంగా చూపుతున్నారు. తాము కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు, మ్యుటేషన్ వివరాలను శివ క్రెడిట్స్ కంపెనీ యజమానులు సమర్పించినా, తమ భూమిలో అక్రమంగా జరిగిన మట్టి తవ్వకాల కారణంగా సరిహద్దులు తేల్చుకోలేకపోతున్నామని, సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతున్నా స్పందించడం లేదు. వైసీపీ నేతల ఒత్తిడితో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై కృష్ణాజిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండ పటిష్టత పనులు ప్రారంభం

ఇంద్రకీలాద్రి దిగువన దుర్గాఘాట్ ఎదురుగా ఉన్న రోడ్డుపక్కన కొంతకాలం కిందట కూలిపోయిన కొండభాగాన్ని పటిష్టపరిచే పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. టెండర్లు కూడా పూర్తి చేశారు. టెంకాయలు కొట్టి హారతులు ఇచ్చారు. ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి, అర్చకులు పాల్గొన్నారు. ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులు పనులను పరిశీలించారు. దుర్గాఘాట్‌లో పరిశుభ్రత, పంచహారతులు సమర్పించే ప్రాంతంలో ఏర్పాట్లను కూడా ఈవో పరిశీలించారు. - వన్‌టౌన్




పనులు ప్రారంభిస్తున్న ఈవో రామారావు

పోలీసుల్లో నిర్లిప్తత

జోరుగా గంజాయి విక్రయాలు, రవాణా జరుగుతున్నా పట్టించుకోని వైనం

మచిలీపట్నంలో నెలరోజుల్లో 19 బుల్లెట్ బైక్‌ల అపహరణ

- పోలీసుల కనుసన్నల్లోనే పేకాట శిబిరాలు
- దొంగతనం, ప్రమాదాల్లో కేసుల్లేకుండా మంత్రాంగం
- రాజీలతో నగదు స్వాహా



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో పేకాట శిబిరాలు జోరుగా నిర్వహిస్తున్నారు. పోలీసులకు ముందస్తుగానే సమాచారం ఇచ్చి, వారికి ఇవ్వాల్సిన మామూళ్లు ఇచ్చి మరీ పేకాట శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మచిలీపట్నం, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో రాత్రి సమయంలో పేకాట నిర్వహించారు. ఈ అంశంపై పోలీస్ ఉన్నతస్థాయి అధికారులు నిఘా పెంచడంతో కొన్ని రోజులపాటు పేకాట శిబిరాలకు విరామం ప్రకటించారు. కొన్ని రోజుల తరువాత గన్నవరం, పెడన ప్రాంతాల్లో పేకాట శిబిరాలు ప్రారంభించారు. రాత్రి సమయంలో వివిధ జిల్లాల నుంచి పేకాటరాయుళ్లను రప్పించి మరీ పేకాట శిబిరాలను నడుపుతున్నారు. ఇటీవల పెడన పోలీస్‌స్టేషన్ సమీపంలో రాత్రి సమయంలో ఏర్పాటుచేసిన పేకాట శిబిరం వద్ద నగదు సర్దుబాటు విషయంలో గొడవ చెలరేగింది. దీంతో ఇరువర్గాలు దాడులు చేసుకున్నాయి. ఇంత జరిగినా పోలీసులు పట్టించుకోలేదు. కొందరు పెద్దలు ఈ వ్యవహారం బయటకురాకుండా రాజీచేశారు.

పోలీసుల తీరుకు నిదర్శనాలు

ఇటీవల మచిలీపట్నం రూరల్ ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొద్దిమొత్తంలో నగదును పట్టుకున్నట్టుగా చూపారు. కానీ ఈ పేకాట శిబిరంలో పెద్దమొత్తంలో నగదును పక్కదారి పట్టించారని కొందరు పోలీసులు, పేకాటరాయుళ్లు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఈ విషయం అల్లరి కావడంతో కొన్ని రోజులుగా పేకాట శిబిరాలను నిర్వహించకుండా తాత్కాలికంగా నిలిపివేశారు.

- మచిలీపట్నం రాజుపేటలో మూడురోజుల క్రితం తాళంవేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగింది. పెద్దమొత్తంలో బంగారు నగలను దోచుకుపోయారు. బాధితురాలు పోయిన బంగారు నగల వివరాలను పోలీసులకు తెలియజేసింది. ఇంతపెద్ద మొత్తంలో బంగారు నగలు పోయాయని చెబితే, వాటి వివరాలు, బిల్లులు అన్నీ ఇవ్వాల్సి ఉంటుందని బాధితురాలికి నచ్చజెప్పి 15 గ్రాముల బంగారం పోయినట్టు కేసు నమోదు చేయడం గమనార్హం.
- మంగినపూడి పరిసర ప్రాంతాల్లో గుడివాడ రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే వారికోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సు తెల్లవారుజామున గుడివాడకు వెళుతుంది. ఇటీవల ఈ బస్సు కిందపడి యువకుడు అక్కడిక్కడే మరణించాడు. నైట్‌బీట్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లారు. ఫొటోలు కూడా తీశారు. అయితే ఈ ఘటనపై కేసు నమోదు కాకుండా పోలీసులే రాజీచేసి పెద్దమొత్తంలో నగదును వెనకేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

గంజాయి విక్రయాలు ఆపేదెవరు?

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి సేవించినవారు ఇటీవల రైల్వేస్టేషన్ సమీపంలో బతుకుదెరువు కోసం ఒరిస్సా రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలపై దాడి చేశారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒక విద్యార్థిపైనా దాడిచేసి అతని వద్ద ఉన్న కొద్దిపాటి నగదును గుంజుకుపోయారు.

- విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయిని రవాణా చేస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.
- నెల రోజుల వ్యవధిలో మచిలీపట్నంలో 19 బుల్లెట్ బైక్‌లు అపహరణకు గురయ్యాయి. గంజాయి విక్రయదారులు ఈ వాహనాలను దొంగిలించి విజయనగరం పరిసర జిల్లాలకు తీసుకువెళ్లి అక్కడ తక్కువ ధరకు విక్రయించి ఆ సొమ్ముతో గంజాయిని కొనుగోలు చేసుకుని తీసుకువస్తున్నారు.
- మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహించే పోలీస్ అధికారి వాహనాన్ని కూడా దొంగలు ఎత్తుకుపోయారు.
- ఇటీవల కాలంలో 12 దొంగతనాలకు పాల్పడిన నిందితుడు తిరుపతిలో ఉన్నట్టుగా పోలీసులు తెలుసుకుని పట్టుకువచ్చారు. పెనమలూరులో దొంగతనం కేసులో సీసీ ఫుటేజీల్లో ఈ నిందితుడు ఉన్నట్టుగా పూర్తి ఆధారాలు పోలీసుల వద్ద ఉన్నాయి. అయినా ఈ నిందితుడిని సరైన విచారణ చేయకుండానే పోలీసులు కోర్టులో హాజరుపరచి చేతులు దులుపుకున్నారు.





రూ. కోటితో మోటార్ల పంపిణీ

రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


- కార్యక్రమానికి తరలివచ్చిన పలు జిల్లాల ఎమ్మెల్యేలు

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. రూ.కోటి సొంత నిధులతో రైతుల పొలాలకు నీటిని తోడేందుకు 50 మోటార్లను పంపిణీ చేశారు.

6లో..

ఆదమరిస్తే అంతే సం'గోతులు'

అడుగు తీసి అడుగేస్తే గోతులు.. ఆదమరిస్తే అంతే సంగతులు.. పెనమలూరు మండలం కానూరు మెయిన్ రోడ్డు చూస్తేనే భయపడి వెనక్కి పారిపోవాల్సిన పరిస్థితి. వాహనదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తూ.. వర్షం పడితే నరకకూపంలా మారే ఈ రహదారి దాటడం ఓ పద్మవ్యూహమే. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. మున్సిపాలిటీ అధికారుల అలక్ష్యం.. వెరసి ఇటుగా రాకపోకలు చేసేవారి ప్రయాణం ప్రమాదకరంగా మారింది.



కానూరులోని సూపర్‌విజ్ రోడ్డు దయనీయ స్థితి ఇదీ..

లైన్ క్లియర్

ఎట్టకేలకు అమరావతి రైల్వేలైనుకు కదలిక

కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో రాజధానికి ప్రాధాన్యమిచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ మరునాడే అమరావతి రైల్వేకు వరాలు కురిపించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అమరావతి రైల్వేలైనుకు పచ్చజెండా ఊపడంతో పాటు విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు అంగీకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.





50 ఏళ్లకు అనుగుణంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి

ఎంపీ కేశినేని చిన్ని బుధవారం పార్లమెంట్‌లో అమృత్ భారత్ పథకానికి సంబంధించి అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ మరిన్ని వివరాలు వెల్లడించారు. అమృత్ భారత్ స్టేషన్ కింద విజయవాడ రైల్వేస్టేషన్‌ను రీ-డెవలప్ చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రద్దీగా ఉండే విజయవాడ రైల్వేస్టేషన్‌ను రాబోయే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. అభివృద్ధి పనులతో పాటు అమరావతి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు కూడా ఒకేసారి చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు.

రూ.2,047 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం

- 56 కిలోమీటర్ల నిడివిలో డీపీఆర్ పూర్తి
- ప్రాజెక్టుకు నీతి ఆయోగ్ అనుమతి
- ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానం
- అమరావతి స్టేషన్ ఏర్పాటుకు చర్యలు
- విజయవాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు రెడీ
- విజయవాడ-గూడూరు థర్డ్‌లైన్ పనులకు రూ.500 కోట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి నూతన రైల్వేలైనుకు కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూ.2,047 కోట్లు కేటాయించింది. మొత్తం 56 కిలోమీటర్ల నిడివితో కూడిన లైనుకు సంబంధించి డీపీఆర్ కూడా పూర్తయింది. ఈ ప్రాజెక్టుకు నీతి ఆయోగ్ అనుమతించింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్.. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ విషయాన్ని బుధవారం విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ తెలిపారు. రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు, తెలుగు రాష్ట్రాల డీఆర్ఎంలతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కేటాయింపులను వివరించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఏపీకి రూ.9,152 కోట్ల కేటాయింపులు జరిపారని తెలిపారు.

విజయవాడ-గూడూరు థర్డ్‌లైన్‌లో భాగంగా విజయవాడ నుంచి గుంటూరు వరకు నిర్మిస్తున్న మూడో లైన్ పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ పనుల కోసం రూ.500 కోట్లు కేటాయించారని చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయవాడ డివిజన్‌లో 23 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. ఆగస్టు 10 నాటికి అవసరమైన చోట పాసింజర్ రైళ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఐఆర్‌సీటీసీ నేతృత్వంలో వంటశాలల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోందని, విజయవాడ పరిధిలో 27 వంటశాలలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. పూర్తిస్థాయిలో విద్యుదీకరణ, జనరల్ బోగీల తయారీకి జనరల్ బడ్జెట్‌లో కేటాయింపులు చేయటం జరిగిందన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- పొలంబడి కార్యక్రమాలతో రైతులకు అవగాహన
- కలెక్టర్ బాలాజీ వెల్లడి

6లో..



కొండాలమ్మకు సారె తెస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కొండాలమ్మకు సారె సమర్పణ

గుడ్లవల్లేరు, జూలై 24 : ఆషాఢమాసం సందర్భంగా వేమవరం కొండాలమ్మ అమ్మవారికి ఆషాఢం సారెను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమర్పించారు. బుధవారం సారెతో ఎమ్మెల్యే హోదాలో ఆయన ఆలయానికి విచ్చేశారు. అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాము మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులకు పాడి పంటలు సుభిక్షంగా పండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శేషవస్త్రంతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

27 నుంచి సుబ్రహ్మణ్యేశ్వర పవిత్రోత్సవాలు



మోపిదేవి, జూలై 24 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పవిత్రోత్రవాలు ఈ నెల 27 నుంచి వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు బుధవారం ఒక ప్రటకనలో తెలిపారు. 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పవిత్రోత్రత్సవ సహిత ఆషాడ కృత్తిక మహోత్సవాలు 27వ తేదీ శనివారం గో పూజతో ప్రారంభమవుతాయన్నారు. స్వామివారి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు పురస్కరించుకుని నిత్య పూజలు, నిత్య కళ్యాణం తాత్కాలికంగా నిలిపివేయటం జరుగుతుందని ఈవో తెలిపారు.



గణిత ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న దేవానంద్‌రెడ్డి

విద్యార్థులకు జీవిత పాఠాలు బోధించాలి

» గణిత ఉపాధ్యాయుల శిక్షణలో దేవానంద్‌రెడ్డి

భవానీపురం, జూలై 24 : చదువంటే పరీక్షలు, ఫలితాలు ఎంత మాత్రం కాదని, జీవితాన్ని నేర్పేదే చదువుకు పరమార్థం అని ఎస్ఎస్‌సి ఎగ్జామినేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ డి. దేవానంద్‌రెడ్డి అన్నారు. భవానీపురంలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ సంయక్తంగా మారిన టెన్త్ సీబీఎస్సీ సిలబస్‌పై ఒక రోజు గణిత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి దేవానంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గణితంపై భయం పోయేలా ప్రాథమిక స్థాయి నుంచి అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయుల్లో నూతన ఉత్తేజం తీసుకువస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మాట్లాడుతూ, ఏపీ మ్యాథమెటిక్స్ ఫోరం గత కొద్ది సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు గణితంలో ఆసక్తి కలిగేలా బోధిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా మల్లిఖార్జునరావు వ్యవహరించగా రిసోర్సు పర్సన్లు భాస్కర్‌రెడ్డి, రవిశంకర్, సోమశేఖర్, నజీర్ హుస్సేన్‌లు టెన్త్ నూతన సిలబస్, రాబోయే ప్రశ్నాపత్నం మోడల్స్, ఇంకా సాంకేతికంగా గణిత బోధనా అభ్యసన ఉపకరణాలపై కూలంకషంగా ఉపాధ్యాయులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డైట్ లెక్చరర్ పి.లలిత మోహన్, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.కరుణాకర్, విజయవాడ బాధ్యులు డీవీ మురళీ ప్రసాద్‌లు ఎన్టీఆర్ జిల్లా నుంచి 300 మంది గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించిన గణిత ఉపాధ్యాయులు 70 మందిని సత్కరించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన సీపీ



విజయవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విజయాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలో ఉన్న ఆయన కార్యాలయానికి బుధవారం వెళ్లారు. పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళలు, అమ్మాయిల అదృశ్యాల కేసులకు సంబంధించి వారి మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది.



శ్రీకాకుళంలో హేచరీని పరిశీలిస్తున్న మత్స్యశాఖ ఏడీ ప్రతిభ, అధికారులు

ఫీడ్ మిల్లులు, హేచరీల తనిఖీ

చల్లపల్లి, జూలై 24 : మత్స్యశాఖ అవనిగడ్డ డివిజన్ ఏడీ ఆర్.ప్రతిభ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం ఫీడ్‌మిల్లులు, హేచరీలను తనిఖీ చేశారు. చల్లపల్లిలోని రెండు ఆక్వాఫీడ్స్ కర్మాగారాలను, శ్రీకాకుళంలోని రొయ్యపిల్లలను సరఫరా చేసే హేచరీని టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి తనిఖీ చేసినట్టు ఏడీ ప్రతిభ చల్లపల్లిలో తెలిపారు. హేచరీలో నిబంధనల మేరకు ఉత్పత్తి జరుగుతుందో లేదో పరిశీలించినట్టు చెప్పారు. నాణ్యమైన సీడ్‌ను రైతులకు అందించాలని హేచరీ నిర్వాహకులకు సూచించారు. ఆక్వాఫీడ్స్‌లో మేత తయారుచేసే విధానం, ముడిపదార్థాలు ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారో పరిశీలన చేసి శాంపిల్స్ సేకరించామని, వాటిని నెల్లూరులోని ఎంపెడా ల్యాబ్‌కు పంపనున్నట్టు చెప్పారు. పరిశీలనపై టాస్క్‌ఫోర్స్ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపెడా ఏడీ సెబాషిస్ మహంతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.గోపాలకృష్ణ, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ స్వామిశేఖర్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరు మారని పంచాయతీ అధికారులు!

» బకాయిల వసూళ్లలో ఉదాసీనత.. గ్రామస్థుల ఆవేదన

నందివాడ (పొలుకొండ), జూలై 24 : ప్రభుత్వం మారినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టు సిబ్బందికి గత 8 నెలలుగా జీతాలు లేని పరిస్థితి ఉందని, పంచాయతీ కార్యదర్శి చుట్టం చూపులా వెళ్లటం తప్ప రావాల్సిన నిధులు వసూలు చేయటం లేదని వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చెరువు పాటలో ఎవరు పాడకపోవటంతో ఎస్టిమేట్ మార్చి చేపల పాట పెట్టాలని గ్రామస్థులు కోరి సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు దాని ఊసే లేదన్నారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ అధికారుల అండ పూర్తిగా ఉండటంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, గ్రామస్థులు, టీడీపీ నేతలు తాతినేని వెంకట కృష్ణారావు, పిన్నమనేని నరసింహారావు తదితరులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పంచాయతీ బకాయిలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అసెంబ్లీ వాయిస్..

ఆర్బీకేలతో రైతుకు ప్రయోజనం శూన్యం

» గళం విప్పిన బోడె ప్రసాద్



పెనమలూరు, జూలై 24 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన రైతుల సమస్యలపై గళమెత్తారు. పంట కాల్వల మరమ్మతులు లేకపోవడం, వర్షపునీరు పొలాల నుంచి బయటికి వెళ్లకపోవడం, కాల్వల నీరు సక్రమంగా చేరకపోవడం తదితర కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారన్నారు. గత ప్రభుత్వం కేవలం ప్రచారార్భాటం కోసమే ఆర్బీకేలను ఏర్పాటు చేసిందని, రైతులు లేనిచోట ఆర్బీకేలను లక్షలు పోసి నిర్మించి ప్రజాధనం వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు తేమ శాతం సాకుగా కనీస మద్దతు ధరను తగ్గించడం, ధాన్యం డబ్బును రైతులకు ఖాతాల్లో వేయకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారని ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. ఇప్పటికీ మిల్లర్లు రైతులకు పదహారు వందల కోట్లు బకాయిలు ఉండటం దారుణమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ మంత్రి కృషి చేయాలన్నారు.



తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో యంత్ర పరికరాలు

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

» మేధో మధన సదస్సును ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

వన్‌టౌన్, జూలై 24 : పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగాలని మహిళా సారధ్య పరిశ్రమలపై సెర్ప్, డీఆర్డీవో ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన మేధో మదన సదస్సును ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన, సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ తదితర పథకాలలో రాయితీపై రుణాలు పొంది నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, స్వీట్ షాపులు తదితర నమూనాల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సదస్సులో ఆమె మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు పేదరికాన్ని రూపుమాపి మహిళలను ఆర్థిక సాధికారిత దిశగా నడిపించేందుకు అనువుగా ఉన్నాయన్నారు. వాటిపై మహిళలను చైతన్యం చేయడం కోసమే సదస్సు లక్ష్యమని తెలిపారు. పీఎంఈజీసీ, పీఎంఎఫ్ఎంఈ, స్టాండప్ ఇండియా వంటి పథకాలలో ఆసక్తి ఉన్న యూనిట్లను ఎంపిక చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో పదివేల యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు, వీటిలో ఐదువేల యూనిట్లు సెర్ప్, డీఆర్‌డీఏల ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటుకు ప్రోత్సహించనున్నట్టు చెప్పారు. లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మేధో మదన సదస్సు లక్ష్యాలను డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు వివరించారు. స్వయం సహాయక సంఘాల రుణాలు(లింకేజీ) తదితర అంశాలను ఏపీ సెర్ప్ డీజీఎం ఎం.కేశవకుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. స్త్రీనిధి ఎండీ నాంచారయ్య, పీఎంఎఫ్ఎంఈ జోనల్ మేనేజర్ జనార్దన్, వ్యవసాయ శాఖ అధికారి సాకా నాగమణెమ్మ, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విద్యాసాగర్, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీ ఎంఐసీ పీడీ పీఎం సుభాని, స్కిల్ సెంటర్ అధికారి నరేష్, కేవీఐపీ డైరక్టర్ గ్రీస్, అధికారులు, యూబీఐ రీజనల్ హెడ్ ఎం శ్రీధర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక ఎస్‌బీఐ ఉత్తర విభాగం ఆర్ఎం రాఘవరావు, పశ్చిమ విభాగం ఆర్ఎం నవీన్‌బాబు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్, ఎస్‌జీబీ ఆర్ఎం జీవీఎం ప్రసాద్, కెనరాబ్యాంక్ అధికారి కె.వినీత, సెంట్రల్ బ్యాంక్ ఆర్ఎం సతీష్, బీఓబీ రీజియనల్ హెడ్ చందన్ సాహు, ఆప్కాబ్ జీఎం రంగబాబు తదితరులు పాల్గొన్నారు.





యంత్ర పరికరాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

» పొలంబడి కార్యక్రమాలతో రైతులకు అవగాహన

» కృష్ణా కలెక్టర్ బాలాజీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ పంటలసాగులో మేలైన యాజమాన్యపద్ధతులు పాటించి, తక్కువపెట్టుబడితో అధికదిగుబడులు సాధించే విధంగా రైతులకు పొలంబడి క్యాక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో బుధవారం వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులకు పొలంబడి కార్యక్రమంలో ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలను రైతులకు పొలంబడి కార్యక్రమం ద్వారా తెలియజేయాలన్నారు. విత్తనం నాటిన నాటినుంచి పంటలకు ఎరువులు, పురుగుమందుల వాడకంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తే తక్కువ పెట్టుబడితోనే అధికదిగబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఖరీఫ్‌సీజన్‌లో 14వారాల పాటు రైతులకు పొలంబడి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పంట మార్కెట్‌లో విక్రయించే సమయానికి వివిధ పంటలలో పురుగుమందులు, ఎరువుల అవశేషాలు ఎంతమేర ఉన్నాయనే అంశంపై నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు పరిశీలన చేస్తుందన్నారు. ఈ నివేదిక ఆధారంగా సేంద్రీయ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ పంటలలో నాణ్యతను నిర్ధారిస్తుందన్నారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా రైతులు పండించిన ఉత్పత్తులను 135 దేశాలలో రైతులు, లేదా రైతుసంఘాల ద్వారా అధిక ధరలకు విక్రయించుకునే వెసులుబాటు వస్తుందన్నారు. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. గతంలో మాదిరిగా కాకుండా పొలంబడి కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన అధికారులు గ్రామాలకు వెళ్లి రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించి నాణ్యమైన ఉత్పత్తులను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ ఎన్.పద్మావతి మాట్లాడుతూ, జిలల్లానుంచి నాచురల్ ఫార్మింగ్ డీపీఎం కె.పార్థసారథి, గూడూరు, బంటుమిల్లి వ్యవసాయశాఖ అధికారులు జీవీ శివప్రసాద్, బి.శివరాం రాష్ట్ర స్థాయిలో పొలంబడి కార్యక్రమంలో శిక్షణపొంది మాస్టర్ ట్రైనర్లుగా ఉన్నారని తెలిపారు. వారు జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ ఇచ్చారని, ఇక్కడ శిక్షణ పొందినవారు క్షేత్రస్థాయిలోని సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ సుధారాణి, డీడీ మనోహరరావు, ఏడీలు, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

» కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై జేసీ గీతాంజలి శర్మతో కలిసి వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంకా ప్రారంభం కాని పనులకు వెంటనే టెండర్లు పిలవాలన్నారు. పెండింగ్‌లో, నిర్మాణ దశలో ఉన్న పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, జరుగుతున్న పనులు, అసలు ప్రారంభం కాని పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీరాజ్ విభాగం ఎస్ఈ విజయకుమారి, డ్రైనేజీ విభాగం ఈఈ విజయలక్ష్మి, నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాసరావు, భూగర్భగనులశాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రూ. కోటితో మోటార్ల పంపిణీ

» రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

» కార్యక్రమానికి హాజరైన పలు జిల్లాల ఎమ్మెల్యేలు, నేతలు



రైతులకు మోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, హాజరైన ఎమ్మెల్యేలు

గుణదల, జూలై 24 : ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి విజయం సాధించడం తనకు చేతకాదని.. దానికి నిదర్శనమే కోటి రూపాయలు సొంత నిధులు వెచ్చించి రైతులకు 50 మోటార్లు పంపిణీ చేయడం జరిగిందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని పార్టీ కార్యాలయంలో రైతులకు మోటార్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి కూటమి ఎమ్మెల్యేలు 11మంది హాజరయ్యారు. ఆరుగాలం కష్టపడే నియోజకవర్గ రైతులకు మోటార్లు పంపిణీ చేస్తానని ఇచ్చిన హామీలో భాగంగా సొంత నిధులనుంచి కోటి రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని యార్లగడ్డ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. గతంలోనూ 2019లో సొంత నిదులతో 18 మోటార్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మోటర్ల కొరత ఉందని కొంతమంది రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎన్నికల ప్రచారంలో రైతులను నీటి ఎద్దడి నుంచి ఆదుకుంటానని మాట ఇచ్చానని చెప్పారు. నియోజకవర్గం నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 37 వేల మెజారిటీతో తనను గెలిపించిన ఓటర్లకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

పుచ్చలపల్లి, కాకాని అడుగుజాడల్లో..

నియోజకవర్గంలో ఎటువంటి అవినీతి చేయబోనని, పుచ్చలపల్లి సుందరయ్య, కాకాని వెంకటరత్నంల అడుగుజాడల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. మల్లవల్లికి అశోక్‌లేలాండ్ సంస్థను తీసుకువచ్చి రీఓపెనింగ్ చేయించినట్టు చెప్పారు. జీడిమెట్ల నుంచి 150మంది పారిశ్రామికవేత్తలు గన్నవరంలో పరిశ్రమలకు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో గన్నవరం నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా.. మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో 15వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే మళ్లీ ఓటు అడగనని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో ఏలూరు కాల్వపై వంతెనలు ఏర్పాటు చేయించనున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో భూదందాలు, సెటిల్మెంట్లు, ఆక్రమణలు అక్రమ వ్యాపారాలు చాలా జరిగాయన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, రాజం ఎమ్మెల్యే కోండ్రం మురళీమోహన్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్, నియోజకవర్గ కూటమి నేతలు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

రూ. 26 లక్షల విలువైన రేషన్ బియ్యం స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జూలై 24 : చిల్లకల్లు సమీపంలో జాతీయ రహదారిపై లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ. 26 లక్షల విలువ చేసే రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని పెద్దవడ్లపూడి నుంచి లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేసి లారీని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తులసీ గోల్డ్ పేరుతో 25 కిలోల సంచుల్లో వెయ్యి సంచుల్లో పాలిష్ బియ్యాన్ని ముంబైకు తరలిస్తున్నట్టు తెలిసిందని బియ్యం శాంపిల్స్ సేకరించి జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులకు పంపుతున్నామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పీడీఎస్ డీటీ నాగరాజు తెలిపారు. చిల్లకల్లు పోలీసుల అదుపులో లారీ ఉంది. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరుగుతుందన్నారు. లారీ వే బిల్లుల్లో మాత్రం రూ. 8.75 లక్షల బియ్యాన్ని ముంబైలోని రిషి ట్రేడింగ్ కంపెనీకి పంపుతున్నట్టు ఉందన్నారు.

క్వారీలో కృష్ణాజిల్లా వాసి మృతి



పెదకాకాని, జూలై 24 : పెదకాకాని పీహెచ్‌సీ సమీపంలోని ఓ క్వారీలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పెదకాకాని పోలీసులు బుధవారం తెలిపారు. వినన్నపేట మండలం తాగుకుంట్ల గ్రామానికి చెందిన కడియాల వెంకట కృష్ణారావు(58)గా అతడ్ని పోలీసులు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

మచిలీపట్నం టౌన్, జూలై 24 : పెడన శివారు వీరభద్రపురం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన భట్టు నాగవిఘ్నేశ్వరరావుకు మచిలీపట్నం ఫోక్సో కోర్టు న్యాయాధికారి గాజుల వెంకటేశ్వరరావు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. పెడన గ్రామానికి చెందిన మైనర్ బాలిక నిందితుడి ఇంటికి ఆడుకునేందుకు వెళ్లగా అతను ఆ బాలికను ఇంట్లోకి తీసుకువెళ్లి హత్యాచారం చేశాడు. దీనిపై పెడన పోలీసు స్టేషన్‌లో 2015 జూన్‌లో కేసు నమోదైంది.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్



జగ్గయ్యపేట రూరల్, జూలై 24 : తెలంగాణాకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని గండ్రాయి వద్ద అడ్డుకుని నిందితులపై ఓల్టా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల గ్రామానికి చెందిన కుంటముక్కల వెంకట శివకృష్ణకు చెందిన టీఎస్ 29 టీఏ 0789 లారీలో ఇసుకను తరలిస్తున్న చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెంకు చెందిన డ్రైవర్ కుంచం మహేష్, క్లీనర్ తాళ్లూరి గోపీలపై ఓల్టా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా.. వెంకట శివకృష్ణకు చెందిన టీఎస్ 29 టీఏ 0789 లారీలో తెలంగాణాకు ఇసుక తరలిస్తుండగా శనివారం రాత్రి గరికపాడు వద్ద లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన సంగతి విదితమే. అదే యజమానికి చెందిన మరో లారీని మంగళవారం రాత్రి గండ్రాయి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు లారీలు ఒకరివే కావటం.. పోలీసులు కేసు నమోదు చేసినా మరల ఇసుక తరలిస్తూ పట్టుబడటం విస్మయం కలిగిస్తున్నది.

అనుమంచిపల్లి ఇసుక యార్డు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ ఎస్ఐ సునీల్‌కమార్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించగా ఎస్ఐ సతీష్ ఓల్టా కేసు నమోదు చేశారు.

అక్రమాలకు అక్షయపాత్రగా అనుమంచిపల్లి యార్డు!

ఇసుక అవసరం ఉన్న వారికే సరఫరా చేయాలనే నిబంధన లేకపోవటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్ యాజమానులతో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఇసుకను ఒక చోట డంప్ చేసి అనంతరం లారీల్లో తెలంగాణాకు తరలిస్తు టన్నుకు అదనంగా రూ. 700లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. స్టాకు యార్డును ప్రైవేట్ వ్యక్తికి అప్పగించటంతో వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. అనుమంచిపల్లి గ్రామం తెలంగాణాకు కూతవేటు దూరంలో ఉండటం కూడా కలిసొచ్చే అంశంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయటంతో పాటు నిజమైన లబ్ధిదారులను గుర్తించి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వాసులు డిమాండ్ చేస్తున్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 24 : జవహర్ విద్యాలయలో 6వతరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయలో 6వ తరగతి నుంచి ఉచిత వసతి, చదువుతో పాటు ఆటపాటలతో వికాసం కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో విద్యాలయాలను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6వతరగతిలో ప్రవేశానికి ప్రకటన వెలువడిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామీణప్రాంత విద్యార్థులకు 75శాతం, దివ్యాంగులకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విదార్థులకు ప్రభుత్వ రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు.

అర్హత వివరాలు : ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, 2013 మే 1 తేదీ నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జెన్వీసెట్(జవహర్ నవోదయ సెలక్షన్ టెస్ట్)2025-26 ద్వారా నిర్వహించే ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు 16-09-2024 చివరితేదీ అని, ప్రవేశపరీక్ష ఫేజ్-1 18-01-2025న, ఫేజ్-2 12-04-2-25న జరుగుతాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ప్రకటనలో వివరించారు.

వైకల్యం శాపం కాకూడదు

హనుమాన్‌జంక్షన్, జూలై 24: అంగవైకల్యం ఉందని ఎప్పటికీ కృంగిపోకుండా ఆత్మస్థైర్యంతో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లి కలలను సాకారం చేసుకోవాలని ఏలూరు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం జిల్లా కో- ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆదిత్య బదిర విద్యాలయం విద్యార్థులకు వైకల్యం - నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. డీడీఆర్సీ కేంద్రం ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో దివ్యాంగులకు ఫిజియో థెరపీ, ఆడియో థెరపీ, సైకలాజీ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ, కరస్పాండెంట్ ఇమంది అన్నపూర్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 24 : పారిశుధ్యంపై దృష్టి సారించాలని, ఇందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మునిసిపాలిటీలో ప్రస్తుతం జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌పై మునిసిపల్ అధికారులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన డ్రైనేజీలు, రోడ్ల అభివృద్ధి గురించి, ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్ గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. డ్రైనేజీ, రోడ్ల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పది రోజులుగా తాడిగడప మునిసిపాలిటీలో జరుగుతున్న శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ పనులను కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలిగించాలని ఆదేశించారు. కానూరులో నెలకొన్న మురుగు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.



మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పారిశుధ్య పనులు చేపట్టాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు వర్షపునీటితో కలిసి ప్రధాన రహదారులపై ప్రవహిస్తూ ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, తక్షణం పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ కార్యదర్శి శ్రీనివాసరావుకు సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ బండారుగూడెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ పూడికతీత పనులు చేయకపోవడంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉండి దోమలు పెరుగుతున్నాయన్నారు. దోమకాటు వల్ల ఇప్పటికే కొందరు వైరల్ జ్వరాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా తక్షణమే డ్రైనేజీ పూడికతీత పనులతో పాటు ఫాగింగ్ పనులను చేపట్టాలని కోరారు.

రహదారుల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

ఫలితాలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ పరిష్కార వేదిక

హనుమాన్‌జంక్షన్, జూలై 24 : అధ్వానంగా మారిన బాపులపాడు పేదల కాలనీ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ నెల 14వ తేదీన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జిల్లా కలెక్టర్‌తో గన్నవరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించిన విషయం తెలిసిందే. వేదికలో కాలనీ రహదారుల అధ్వానస్థితిపై కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంలో కాలనీలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా అభివృద్ధి చేయకుండా వదిలేయడంతో కాలనీవాసులు కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగా మారిందని గ్రామ ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, తదితర గ్రామ పెద్దలు ఎమ్మెల్యే యార్లగడ్డ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వెంటనే సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కాలనీ రహదారుల సమస్యపై నివేదిక తయారు చేసి పంపించాలని కలెక్టర్ కార్యాలయం నుంచి గ్రామ ఇంజనీరింగ్ శాఖకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ సిబ్బంది అంచానలు తయారు చేసి అప్‌లోడు చేశారు. కాలనీ ప్రధాన రహదారితో పాటు లేఅవుట్‌లోని అంతర్గత రహదారులను దాదాపు 4.కి.మీ మేరకు తొలుత మట్టితో మెరక చేసి గ్రావెల్‌తో అభివృద్ధి చేయడానికి దాదాపు రూ.70లక్షలతో అంచనాలు తయారు చేసి పంపించినట్లు ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది తెలిపారు.

రాష్ట్రానికి నిధులు కేటాయించటం హర్షణీయం

గన్నవరం, జూలై 24 : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధా న కార్యదర్శి శేషుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థికలోటుతో కుంటుపడిన ఆంధ్ర రాష్ట్ర రాజధాని అభివృద్ధికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి సహకారం యువత విద్య నైపుణ్యం, ఉద్యోగం, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు తోడ్పాటు, మరిన్ని కేంద్ర ప్రణాళికలు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఊతం ఇస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం అమృత హస్తం అందించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడలను ప్రోత్సహించాలి

గన్నవరం, జూలై 24 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతుంది. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవిఆర్ కిషోర్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలోని ప్రతిభవంతులైన క్రీడాకారులను వెలికితీయటమే లక్ష్యమని ఆయన తెలిపారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం చేకూరుతుందని చెప్పారు. విద్యార్థులు చిన్న నాటి నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. క్రీడల్లో రాణించే వారికి ప్రోత్సాహకాలు మెండుగా ఉంటాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, జూలై 24 : యనమలకుదురు నుంచి తాడిగడప 33కేవీ ఫీడరు మెయింటినెన్స్ పనుల కారణంగా నేడు ఉదయం ఏడు గంటల నుంచి పదకొండు వరకు పద్మజానగర్, శ్రీనివాసనగర్, ఇందిరానగర్ 2, జన్మభూమి వంతెన రోడ్డు, డొంకరోడ్డు, లిబ్రా కాలనీ, శ్రీనివాసనగర్ కట్ట, వసంతనగర్ కట్ట, రామ్‌నగర్, బాలాజీనగర్, పటమట ప్రాంతంలోని రఘుగార్డెన్, కరివేపాకు తోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జనసేన కార్యకర్తకు ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

ఉయ్యూరు, జూలై 23 : జనసేన పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రాము అన్నారు. ఉయ్యూరు 20వ వార్డులో జనసేన కార్యకర్త ఇటీవల బైకు ప్రమాదానికి గురై గాయపడగా జనసేన పార్టీ తరఫున ప్రమాద బీమా రూ. 31,500 చెక్కును బుధవారం టీడీపీ నాయకులు గుర్నాధరావు, చిరంజీవి రాముకు అందజేశారు. ఉయ్యూరు పట్టణ జనసేన నాయకులు ఓంకార్, శివప్రసాద్, వినయ్, మూర్తి, వెంకటేష్, మహాలక్ష్మి, వెంకటరమణ, పూజిత, శేషుమణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న శ్రీవిశ్వశాంతి సిబ్బంది

ఉయ్యూరు, జూలై 24 : రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాలు కాపాడిన వారమవుతామని శ్రీవిశ్వశాంతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదల సూర్యశేఖర్ అన్నారు. ఉయ్యూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీవిశ్వశాంతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సూర్యశేఖర్ ప్రారంభించగా 70మంది శ్రీవిశ్వ శాంతి ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు చొప్పరుపు సుబ్రమణ్యం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్ది, ఉన్నతస్థాయికి చేరుకునేందుకు ఎంతో కాలంగా తోడ్పడుతున్న శ్రీవిశ్వ శాంతి యాజమాన్యం, ఉద్యోగులు, సిబ్బంది కొందరి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్, కేసీపీ డీజీఎం సంపత్‌కుమార్, క్లబ్ సెక్రటరీ అమీర్ మీర్జా, సభ్యులు ప్రసాదరెడ్డి, బిట్ర రామ్మోహనరావు, పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని సేవలందించారు.

ఘనంగా అయ్యంకి జయంతి



మానికొండ గ్రంథాలయంలో..

ఉంగుటూరు, జూలై 24 : గ్రామీణ ప్రాంతాల వారికి గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చిన ఘనత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్యకే దక్కుతుందని, గ్రంథాలయాల అభివృద్ధికి జీవితాంతం కృషి చేసిన ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని మానికొండ గ్రంథాలయాధికారి ఎల్.హరికృష్ణ పిలుపునిచ్చారు. గ్రంథాలయోద్యమకారుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని బుధవారం మానికొండ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ, ప్రజాగ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం అని అయ్యంకి వెంకటరమణయ్య చాటిచెప్పారన్నారు. ప్రజల్లో అక్షరజ్ఞానాన్ని పెంచేందుకు దేశవ్యాప్తంగా గ్రంథాలయాలను నెలకొల్పారన్నారు. ఆ మహనీయుని కృషి ఫలితమే నేడు ఊరూరా గ్రంథాలయాలు వెలసి ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. వెంకటరమణయ్య ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని గ్రంథాలయాల విశిష్టతను చాటిచెప్పటమే నేటితరం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



ప్రియాంక

ఉంగుటూరు, జూలై 24 : మండలంలోని ఆత్కూరు జగనన్న కాలనీలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. ఆత్కూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కత్తి చినవెంకటేశ్వరరావు(30)కు, ఏలూరు జిల్లా పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన ప్రియాంక(28)కు ఆరున్నర ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 5ఏళ్లు, 3ఏళ్ల వయసుగల ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భర్త చినవెంకటేశ్వరరావు పెదఅవుటపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా చిరు ఉద్యోగం చేసేవాడు. కొంత కాలంగా వ్యసనాలకు అలవాటు పడి ఉద్యోగం మానేశాడు. రోజూ తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. వేధింపులు తాళలేక భార్య ప్రియాంక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రియాంక మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అల్లుడే హతమార్చాడు..

తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఎంతో ధైర్యవంతురాలని, తన అల్లుడు, వేరే వ్యక్తితో కలిసి అమ్మాయిని కావాలనే ఉద్దేశపూర్వకంగా కొట్టిచంపారని, మృతురాలి తండ్రి పల్లగాని వీరమల్లేశ్వరరావు ఆరోపించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై ఏ.పైడిబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



గుడివాడ : మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వేదపండితులు పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈవో వి.డి.డి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

● పుల్లలపాడు వంతెన వద్ద బాల గణపతిస్వామి దేవస్థానంలో శాకంబరీ దేవి ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సుధారాణి, అన్నే రాణి

ఉయ్యూరు, జూలై 24 : వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు చిన్న వయస్సు నుంచి మొక్కలునాటి సంరక్షిచండం అలవాటు చేసుకుని ఆదర్శప్రాయులుగా నిలవాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అ ధ్యక్ష కార్యదర్శులు నర్రా సుధారాణి, అన్నే రాణి అన్నారు. పర్యావరణ రక్షణలో భాగంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పచ్చని చెట్లను విచక్షణారహితంగా నరికివే యడం వల్ల పచ్చదనం కోల్పోయి వాతావరణ సమతుల్యతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. విద్యార్థి దశనుంచి మొక్కలు నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల సంభవించే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల ఆవరణ, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాట డం ఉద్యమంలా చేపట్టాలని క్లబ్ సభ్యురాలు ఎల్. సూర్యకుమారి అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, డైట్ కళాశాల అధ్యాపకుడు పీటీజీ శ్రీనివాసచార్యులు, ఉపాధ్యాయులు రమణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో ఉద్యోగులందరూ పాల్గొనాలి



మచిలీపట్నం టౌన్, జూలై 24 : యోగశిక్షణా తరగతుల్లో ఉద్యోగులందరూ పాల్గొనాలని కలెక్టర్ బాలాజీ పిలుపు నిచ్చారు. బుధవారం జడ్పీ కన్వెన్షన్ హాలులో రెండవ రోజు యోగ శిక్షణా శిబిరంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో చంద్రశేఖరరావు, ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఝాన్సీ తదితరులుపాల్గొన్నారు.



కనకదుర్గమ్మకు ఆషాఢసారె తీసుకెళ్తున్న కొల్లు నీలిమ

ప్రతి ఎకరాకు సాగునీరు

గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జూలై 24 : గుడివాడ నియోజక వర్గంలో ఇరిగేషన్ కాల్వలో మురుగు, తూటకాడ నిర్మూలనకు రూ.2.90 కోట్లు నిధులతో పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. వడ్లమన్నాడులో బుధవారం తూడు తొలగింపు పనులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగం కోరిన మేరకు తాము ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నామన్నారు. ప్రతీ ఎకరాకూ సాగునీటిని అందిస్తున్నామన్నారు. రూ1.58 కోట్లతో మేజర్ ఇరిగేషన్ కాల్వలను, రూ90.30 లక్షల నిధులతో డ్రైన్ల పూడికతీత పనులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం లో పెన్నేరు రమేష్, ఈడే కృష్ణ, మాదాసు శ్రీను, తోట చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



వడ్లమన్నాడు డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో ఉండాలి

మచిలీపట్నం టౌన్, జూలై 24 : రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి మచిలీపట్నం తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ సారె తీసుకువెళ్తున్నట్లు రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అన్నారు. బుధవా రం మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి నుంచి తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి ఆషాఢ సారె తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాల పర్తి పద్మజ, కరెడ్ల సుశీల, వాలిశెట్టి హైమావతి తదితరులు పాల్గొన్నారు. ● బలరామునిపేటలోని కోదండ రామాలయంలో అమ్మవారికి సువాసినులు ఆషాఢసారె సమర్పించారు. కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారికి వాసవీ క్లబ్ ప్రతినిధులు శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, సత్యవతి, దివ్యశ్రీ తదితరులు సారె సమర్పించారు.



యోగాలో ఉద్యోగులందరూ పాల్గొనాలి : కలెక్టర్



మచిలీపట్నం టౌన్, జూలై 24 : యోగశిక్షణా తరగతుల్లో ఉద్యోగులందరూ పాల్గొనాలని కలెక్టర్ బాలాజీ పిలుపు నిచ్చారు. బుధవారం జడ్పీ కన్వెన్షన్ హాలులో రెండవ రోజు యోగ శిక్షణా శిబిరంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో చంద్రశేఖరరావు, ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఝాన్సీ తదితరులుపాల్గొన్నారు.



సీపీఎం నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, జూలై 24 : కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ ఉక్కు హామీలపై ఉదాహరించ కపోవడం పట్ల సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కృష్ణాజిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, సీపీఎం నాయకులు కొడాలి శర్మ, జయరావు, జి. కిషోర్, రాజేష్, యూనస్, ఎన్.ఎస్. నారాయణ, కొడాలి సుజాత, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు

గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జూలై 24 : గుడివాడ నియోజకవర్గంలో ఇరిగేషన్ కాల్వలో ముగురు, తూటకాడ నిర్మూలనకు రూ.2.90 కోట్లు నిధులతో పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. వడ్లమన్నాడులో బుధవారం తూడు తొలగింపు పనులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగం కోరిన మేరకు తాము ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నామన్నారు. ప్రతీ ఎకరాకూ సాగు నీటిని అందిస్తున్నామన్నారు. రూ1.58 కోట్లతో మేజర్ ఇరిగేషన్ కాల్వలను, రూ90.30 లక్షల నిధులతో డ్రైన్ల పూడికతీత పనులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెన్నేరు రమేష్, ఈడే కృష్ణ, మాదాసు శ్రీను, తోట చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పూడికతీత

మోపిదేవి: మండలంలోని వెంకటాపురంలో గత కొద్ది సంవత్సరాలుగా పూడుకుపోయిన సాగునీటి కాలువ పూడికతీత పనులకు ఆయకట్టు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వెంకటాపురంలోని 11/2 బ్రాంచ్ కాలువ నుంచి రైసు మిల్లు మీదుగా మెరకనపల్లి పంచాయతీ పరిధిలోని మురుగు కాలువ వరకు ఉన్న పంట బోదు పూడికతీత పనులు దేవినేని సుబ్రహ్మణ్యం అనే రైతు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు.



వడ్లమన్నాడు డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుర్రపుడెక్క నివారణకు స్ప్రేయింగ్ ప్రారంభించిన అధికారులు

● పెదప్రోలులోని గొర్రుకోడు మురుగు డ్రెయిన్‌లో దట్టంగా అలుముకుని ఉన్న గుర్రపు డెక్క నిర్మూలన చర్యలు డ్రెయినేజీ శాఖాధికారులు బుధవారం చేపట్టారు. సాగుకు అవరోధంగా గుర్రపు డెక్క అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైంది. స్పందించిన డ్రెయినేజీ శాఖాధికారులు ప్రాథమికంగా గుర్రపు డెక్క నివారణ మందు స్ప్రెయింగ్ పనులు చేపట్టారు. అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనలతో మురుగు డ్రెయిన్ ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛ చల్లపల్లి కృషి



చల్లపల్లి : పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం ద్వారా ఎంతగానో కృషి చేస్తున్నట్లు స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్ - డాక్టర్ పద్మావతిలు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 3183వ రోజు స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో భాగంగా చల్లపల్లిలో హైవేకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్కే, పద్మావతిలు మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలోనూ మరోసారి విస్తృతస్థాయిలో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. హైవేకి ఇరువైపులా పలు మొక్కలను కార్యకర్తలు నాటారు. పలువురు స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

కోడూరు : జాతీయ విద్యావిధానం ఎన్ఈపీ (నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ) నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా విద్యాశాఖ 'శిక్షా సప్తాహ్' పేరుతో ఈ నెల 22 నుంచి 28వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు బుధవారం స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ఆలా వెంకట రమణ, బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, పూతబోయిన కరుణ కుమార్, పిల్లి మల్లిఖార్జునరావు, ఆవుల బసవయ్య, పూతబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పులిగడ్డ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి అవనిగడ్డ -2 ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చియ్య అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఆటపాటల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు.

పమిడిముక్కల : ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షసప్తాహ్(విద్యావారోత్సవాలు) లో భాగంగా పమిడిము క్కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా ఉత్సవం నిర్వహించారు. గ్రామీణ క్రీడలు తొక్కుడుబిళ్ల, ఉప్పుశర్రు, పులి-మేక తదితర ఆటలను విద్యార్థులతో ఆడించారు. ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఎం కేశవనారాయణరావు, పీడీ వెంకటనారా యణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



గుడివాడ : మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వేదపండితులు పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈవో వి.డి.డి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలగణపతిస్వామి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు

పుల్లలపాడు వంతెన వద్ద బాల గణపతిస్వామి దేవస్థానంలో శాకంబరీ దేవి ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించారు. వేద పండితులు పంచ హారతులిచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

పామర్రు, జూలై 24 : మహాకవి గుర్రం జాషువా వర్ధంతి శివరామ థియేటర్ కాంప్లెక్స్ నందు దళితగిరిజన హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబూ జగ్జీవన్‌రామ్ కల్చరల్ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చిగళ్ల దేవానందం మాట్లాడుతూ, జాషువా తన కవిత్వం ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన మహానీయుడన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వరరావు, జువ్వనపూడి సురేంద్ర, జంపుల కోటేశ్వరరావు, కోల్లాబత్తుల సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

పరాసుపేటలో జనసేన సభ్యత్వ నమోదు



మచిలీపట్నం టౌన్, జూలై 24 : పరాసుపేటలో జనసేన నాయకుడు కొట్టె వెంకట్రావు ఏర్పాటు చేసిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు శిబిరాన్ని బండి రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వాలిశెట్టి మల్లి, గడ్డం రాజు, వంపుగడల చౌదరి, యర్రంశెట్టి నాని, మహమ్మద్ బాషీ, శాయన శివ, తోట బాస్కర్, పృధ్వి, కర్రి ప్రకాష్, రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

26న ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నం టౌన్, జూలై 24 : మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న టాప్‌స్టార్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు బార్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు. రూ. 2250 విలువ గల పరీక్షలను ఉచితంగా చేయిస్తారన్నారు.

ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నం టౌన్, జూలై 24 : బైపాస్ రోడ్డులో ఫుడ్ కోర్టు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు బైపాస్‌రోడ్డులో ఇంకా మిగిలి ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. ఆక్రమణదారులకు చెప్పి చెప్పి విసిగిపోయినా బడ్డీలు తొలగింకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగారు. పెద్ద ఎత్తున ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపట్టారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ



మోపిదేవి, జూలై 24 : ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులు ఆసక్తి కనబర్చుకోవాల్సిందిగా అవనిగడ్డ ఉద్యాన శాఖాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మడంలంలోని ఉత్తరచిరువోలులంకలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. దేశవాళి మొక్కలకు 20 వేలు, విదేశీ మొక్కలకు 29 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు.

అవనిగడ్డ : నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు వాహన్ సావీ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఉండవల్లి ఆగ్రోస్ వారి ద్వారా ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో మొక్కల పంపిణీ, పంట కొనుగోలు బాధ్యతను ఉండవల్లి ఆగ్రోస్‌కు కేటాయించిందని కంపెనీ డీజీఎం డి.హరికృష్ణ తెలిపారు. ఇప్పటికే అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో పెద్ద ఎత్తున రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

సాగు ఖర్చు తగ్గించుకోవాలి



కృష్ణాపురం(పమిడిముక్కల) : ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించుకుని లాభసాటి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి రైతులకు సూచించారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాపురం, మేడూరులో వరిసాగుపై రైతులకు పొలంబడి నిర్వహించారు. ఎంహెచ్‌వో నాగదేవిశ్రీ, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు ప్రేమరంజితం, సురేశ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాటన్ దొరకు ఘననివాళి



గుడివాడ : ఏఎన్ఆర్ కళాశాల్లో నీటిపారుదలసర్ ఆర్థర్ కాటన్ దొర వర్థంతి సందర్భంగా బుధవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ మాట్లాడుతూ ఎటువంటి టెక్నాలజీ లేని రోజుల్లో రైతులు పడుతున్న కష్టాలను చూసి చలించి అటవీ ప్రాంతంలో పర్యటించి బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె. ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, గ్రంథాలయాధికారి బి.ఎస్.ఎస్.పద్మజ పాల్గొన్నారు.

101 మందికి కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక: నంగగేడ్డ మాజీ సర్పంచ్ దివంగత కోసూరు సీతారామయ్య ఇంటి దగ్గర నాగాయలంక సాయి దుర్గా కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం జరిగింది. జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 101 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 27 మందికి ఉచిత కంటి ఆపరేషన్లకు తీసుకెళ్లినట్లు కంటి వైద్యులు రామారావు తెలిపారు. కోసూరు నాగేశ్వరరావు, సనకా ఆదిశేషు, జనసైనికులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు



మచిలీపట్నం టౌన్, జూలై 24 : ల్యాండ్‌టైట్లింగ్ చట్టం వైసీపీ నాయకులు భూదోపిడీకేనని, ఆ చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఉద్యమ సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు చట్టాన్ని అసెంబ్లీలో రద్దు చేశారని టీడీపీ తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ బిల్లును సభలో ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసరాలు

పెడన, జూలై 24 : వర్షాల వల్ల పనులు లేక ఇబ్బందులు పడుతున్న గూడూరు మండలం పోలవరంలోని వివేకానంద చేనేత సహకార సంఘానికి చెందిన చేనేత కార్మికులకు ఆ సంఘ అధ్యక్షుడు బళ్ల సాయి ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో మంచినూనె చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాసగాని శ్రీనివాసరావు, గూడూరు మాజీ సర్పంచ్ అన్నం హరిరామకృష్ణ, పోలవరం మాజీ సర్పంచ్ కారుపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల పన్నుల వెరిఫికేషన్

పట్టణంలో ఇళ్ల పన్నుల వెరిఫికేషన్ జరుగుతోంది. ఈ వెరిఫికేషన్‌లో మునిసిపల్, సచివాలయ ఉద్యోగులు తక్కువ పన్నులు వేసిన ఇళ్లనును, అసలు పన్నే వేయని ఇళ్లను గుర్తిస్తున్నారు. కమిషనర్ బి. వెంకట్రామయ్య ఈ వెరిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

100 మందికి అన్నదానం

తన మాతృమూర్తి కూనపరెడ్డి సుశీల, సోదరి సూదాబత్తుల ధనలక్ష్మిల జ్ఞాపకార్థం కాంట్రాక్టర్ కూనపరెడ్డి వెంకటేశ్వరరావు, వెంకటధనలక్ష్మి దంపతులు బుధవారం పట్టణంలోని అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లో 100 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. ఫౌండేషన్ నిర్వాహకుడు యర్రా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మకు ఆషాఢసారె తీసుకెళ్తున్న కొల్లు నీలిమ

రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో ఉండాలి

మచిలీపట్నం టౌన్, జూలై 24 : రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి మచిలీపట్నం తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ సారె తీసుకువెళ్తున్నట్టు రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అన్నారు. బుధవా రం మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి నుంచి తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి ఆషాఢ సారె తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ, కరెడ్ల సుశీల, వాలిశెట్టి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

● బలరామునిపేటలోని కోదండ రామాలయంలో అమ్మవారికి సువాసినులు ఆషాఢసారె సమర్పించారు. కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారికి వాసవీ క్లబ్ ప్రతినిధులు శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, సత్యవతి, దివ్యశ్రీ తదితరులు సారె సమర్పించారు.

యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు



మచిలీపట్నం టౌన్, జూలై 24 : ఐదేళ్ల వైసీపీ పాలనలో పారిశుధ్యం కార్యక్రమాలను విస్మరించారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లోని సుకర్లాబాద్‌లో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ మచిలీపట్నం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, పిప్పళ్ల కాంతారావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ బాలికల వసతిగృహం పరిశీలన

నాగాయలంక, జూలై 24 : నాగాయలంకలోని ఎస్సీ, బీసీ బాలికల వసతిగృహాలను జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు సందర్శించి, మౌలిక వసతులను పరిశీలించారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో తాగునీరు సమస్య, బాత్ రూమ్‌లు బాగు చేయించవలసిన అవసరత ఉందని గుర్తించారు. బీసీ బాలికల వసతిగృహంలో కొన్ని సమస్యలు గుర్తించారు. సదరు విషయాలను నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి ఈ వసతిగృహాలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని రాయపూడి అధికారులకు తెలిపారు. జనసేన వీర మహిళలు కృష్ణకుమారి, నాగమల్లేశ్వరి, ఆళ్లమళ్ల చందుబాబు పాల్గొన్నారు.